ప్రజాశక్తి
శనివారం 07 జనవరి 2023
5
కర్నూలు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలులో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్

- అనువైన ప్రాంతం కోసం అన్వేషణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో మొత్తం 9 ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ నిర్ణయించింది. ఇందులో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పైలట్ ప్రాజెక్టుగా మొదట విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ సేవలు విజయవంతం కావడంతో మిగిలిన ఏడు చోట్ల ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా కర్నూలులో ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటరును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అధికారులు కర్నూలు నగరంలో ప్రజలకు అనువైన ప్రాంతం, వెయ్యి చదరపు అడుగుల భవనం కోసం అన్వేషణ చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే జనవరి నుంచి ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటరును ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రీమియం రిజిస్ట్రేషన్ సెంటర్ ఫ్రంట్ ఎండ్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది, డేటా ఎంట్రీ అపరేటర్లు ఉంటారు. బ్యాక్ ఎండ్లో సబ్ రిజిస్ట్రార్, ఇతర సిబ్బంది ఉండి పనిచేస్తారు. మొదట కొద్ది రోజులు ఆఫ్‌లైన్ సేవలు అందించినా తర్వాత అన్నీ ఆన్‌లైన్ సేవలే ప్రజలకు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేశారు. అంతేకాక ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారం సెంటరుకు వెళ్లి రిక్వెస్టు పెడితే ఆన్‌లైన్‌లో సంబంధిత సేవా ప్రక్రియ మొదలవుతుంది. వినియోగదారులే తమ సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు. అప్పుడు ఆన్‌లైన్ ద్వారానే సబ్ రిజిస్ట్రార్‌కు వెళ్తుంది. సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి ఆధార్ వెరిఫికేషన్ చేస్తారు. అనంతరం ఆస్తుల వివరాలను పరిశీలించి సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.రిజిస్ట్రేషన్ అయిన వెంటనే చేయించుకున్న వారికి పూర్తయినట్లు మెస్సేజ్ వెళ్తుంది. రిజిస్ట్రేషన్లు, మార్కెట్ విలువ మదింపు, ఈసిలు, సిసిలు, స్టాంపుల అమ్మకాలన్నీ ఆ సెంటర్ ద్వారానే జరగనున్నాయి.

సహాయ రక్షణ సలహా వ్యవస్థ ప్రారంభం

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

కర్నూలు జిల్లా కోర్ట్ ఆవరణలో చట్టపరమైన సహాయ రక్షణ సలహా వ్యవస్థ న్యాయ సేవా సదనం2వ అంతస్తులో హైకోర్టు న్యాయమూర్తి ఎపి ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఎపిఎస్ఎల్ఎస్ఎ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దృశ్యవీక్షణం ద్వారా శుక్రవారం ప్రారంభించారు. కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎన్.శ్రీనివాసరావు, కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు. వీరితోపాటు ఈ వ్యవస్థలో కొత్తగా నియమించిన చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఎస్. మనోహర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది, ఎం.శివ రామ చంద్ర రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఎ.సులోచన తదితరులు పాల్గొన్నారు. ఈ వ్యవస్థలో లీగల్ సర్వీసెస్ అధికారులు నిందితులకు న్యాయ సేవలను అందిస్తారు. అంతేకాక నిర్బంధంలో ఉన్న దోషులు లేదా లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్, 1987లోని సెక్షన్ 12 ప్రకారం తెలుపబడిన అర్హత ప్రమాణాల పరిధిలోకి వచ్చేవారు, నేరస్థులలో ముందస్తు అరెస్టు, రిమాండ్, విచారణ మెజిస్ట్రేట్ కోర్ట్ అధికార పరిధి నుంచి జిల్లా కోర్ట్ అధికార పరిధి వరకు న్యాయ సంబంధమైన అన్నీ సలహాలు , విచారణకు కావలసిన సేవలను ఉచితంగా అందిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస రావు

కోర్టు ఆధారిత నేర న్యాయ సేవల వ్యవస్థను బలోపేతం చేయాలని ఆర్థికంగా, బలహీనమైన, అట్టడుగు వర్గాలకు సమర్థవంతమైన, ఉచిత న్యాయ సేవలను అందించడం కోసం ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుంది. న్యాయవాదులు పాల్గొన్నారు.

మండలి ఓటర్ల తుది జాబితా విడుదల

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా అంశంపై రాజకీయ పార్టీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇటీవలే కర్నూలు జిల్లా తుది ఓటరు జాబితా అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రచురించినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ రాజకీయ పార్టీలకు తుది ఓటరు జాబితా ప్రతులను అనంతపురం ఎన్నికల ఓటర్ల నమోదు అధికారి, డిఆర్ఒ అందజేసినట్లు తెలిపారు. మొదటి, రెండో విడతల ఓటర్ల నమోదులో భాగంగా 66 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలకు గాను 61,684 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని చెప్పారు. అందులో పురుషులు 42,097 మంది, కాగా 19,586 మంది స్త్రీలు, ఇతరులు ఒక్కరు ఉన్నారని తెలిపారు. 25 ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాలకు గాను 5,364 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని చెప్పారు. అందులో 2,983 మంది పురుషులు, కాగా స్త్రీలు 2,381 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వర రావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ మురళీ, వైసిపి, టిడిపి, బిజెపి, బీఎస్పీ, సిపిఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఈవీఎం గోడౌన్‌లో ఉన్న ఎం-3 సిరీస్ వివి ప్యాట్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో ఉన్న ఎం-3 సిరీస్ వివి ప్యాట్‌లను, స్ట్రాంగ్ రూమును ప్రతి మూడు నెలలకోసారి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం గోడౌన్‌లో సిబ్బంది అందరూ మాస్కులు ధరించి వివి ప్యాట్‌ల నిర్వహణ పనులు చేపట్టేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ నాగేశ్వరరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మురళీ, పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- విద్యుత్ శాఖ ఐటి డైరెక్టర్ శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రమాదాలను నివారించి నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు అందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్‌కంపెనీల ప్రాజెక్టు , ఐటి డైరెక్టర్ కె. శివప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్నూలు విద్యుత్ భవన్ కౌన్సిల్ హాలులో ఇఇ డిప్యూటీ డి ఇ, ఎఇలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సంస్థలో ఎక్కువమంది చనిపోతున్నారని, అందుకుగల కారణాలను తెలుసుకునేందుకు, లోపాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌ఫర్ట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ప్రధాన కారణాలుగా ప్రైవేటు ప్రభుత్వ రంగంలో జరిగే ప్రమాదాలు టెక్నికల్ కమ్యూనికేషన్ గ్యాప్ వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. 1912 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఎవరైనా ప్రజలు ప్రమాదాలకు సంబంధించిన ఫోటోలు తీసి వాట్సాప్ నెంబర్‌కు తెలిపితే వెంటనే స్పందిస్తామన్నారు. ప్రమాదాలు నివారించేందుకు అత్యవసర సమయాల్లో వాట్సాప్ నెంబర్‌ను ఉపయోగించేందుకు కేటాయించారన్నారు. లైన్‌మెన్ పెట్రోలింగ్ అప్లికేషన్ (యాప్) ఫీల్డ్‌లో పనిచేసే వారికి ఇచ్చి పెట్రోలింగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ప్రణాళికలు ఏర్పాటు చేసి ఖచ్చితమైన సమయంలో పనిచేసేందుకు, తప్పించుకునేందుకు వీలు లేకుండా ఉద్యోగస్తులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లైన్ సమస్యలు లేకుండా ఉంచుకోవడానికి లైన్ క్లియర్ చేసుకోవడానికి లైన్ ట్రిప్ కాకుండా ఉండేందుకు ఈ సిస్టం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఉద్యోగులు ఆరోగ్యంగా క్షేమంగా ఉండేందుకు ట్యాబ్‌లు, మొబైలు ఫీడర్లలో ఉంచుతామన్నారు. ఈ జాగ్రత్తల వల్ల రైతులు స్తంభాలు ఎక్కకుండా ఉద్యోగస్తులు బాధ్యతాయుతంగా వివరించే విధంగా అవగాహన కల్పించే ఈ యాప్ లు పల్లెలకు అవగాహన కల్పిస్తామన్నారు. దీంతో ఓవర్‌ల్యాప్, లోడ్ తగ్గిస్తామన్నారు. భవిష్యత్తులో పల్లెలకు పట్టణాలకు నగరాలకు వేర్వేరుగా లైన్లు ఉంటాయని అన్నారు. అపోహలకు తావు లేకుండా ట్రూఆఫ్ చార్జీలు మరుసటి నెలలోనే చూసుకునే వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఇ. ఎం ఉమాపతి పాల్గొన్నారు.ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం...

- ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజకుల సమస్యల పరిష్కారానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం చేద్దామని ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదాల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు కార్మికకర్షక భవనంలో శుక్రవారం 'రజకుల సమస్యలు- ప్రభుత్వ విధానాలు-పరిష్కార మార్గాలు' అంశంపై సి.ముక్కన్న అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు. భాస్కరయ్య మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి సాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం చేద్దామని అన్నారు. పాలకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న వత్తికి ఉపయోగపడే భూములు చెరువులను కూడా ధనవంతులు లీజుకు ఇచ్చేందుకు జీవోలు తెచ్చే ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. బిసి ప్రధానమంత్రి అనిచెప్పుకునే మోడీ బిపి కులగనన ఎందుకు చేయడం లేదని అన్నారు. రిజర్వేషన్లు కులాలు. మతాల పేరుతో ప్రజల్ని వృత్తి దారుల్ని మభ్యపెట్టి మాయ మాటలతో కాలం గడుపుతున్నారని చెప్పారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చే సంస్కరణలు ప్రజలకు, వృత్తిదారులకు భారంగా మారుతున్నాయన్నారు. అధికారంలోకి వస్తే అందరికీ మేలు చేస్తామని చెప్పిన వైఎస్. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా చేతి వృత్తిదారుల చేసిందేమీ లేదన్నారు. సమాజంలో చాలా ప్రాంతాల్లో రజకుల పట్ల కుల వివక్షత, దాడులు, అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయని, రజకుల భద్రతకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవో నెంబర్ 27 ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ధోబి పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువతీ యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్పొరేషన్‌కి ఇప్పటికైనా రూ. వెయ్యికోట్లు కేటాయించి రజక వృత్తిదారులకు ఉపయోగపడే విధంగా ఖర్చు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని కర్నూలు నగరం, మున్సిపాలిటీ పట్టణ కేంద్రాల్లో అర్హులైన రజకులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇల్లు నిర్మించాలని, వృత్తిదారులకు అధునాతనమైన యంత్రాలతో మోడ్రన్ ధోబి గాడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 50 సంవత్సరాలు పూర్తయిన రజకులకు పిన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అంతకు ముందు ఎపి రజక వృత్తిదారుల సంఘం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సి. హనుమంతన్న, సంఘం ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసులు, అధ్యక్షులు జయమ్మ, న్యూ సిటీ కార్యదర్శిసి .శేషాద్రి, అధ్యక్షులు రాము, సంఘం నంద్యాల జిల్లా కన్వీనర్ సి. వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ బాబు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న భాస్కరయ్య




కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

ఎకరాకు రూ 60 లక్షలివ్వాలి : ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్ : చెన్నై టు సూరత్ సిక్స్‌వే నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించే భూములకు ఎకరాకు రూ.60 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావును భూ బాధితులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. కర్నూలు మండలం ఉల్చాగ్రామం మీదుగా వెళుతున్న సిక్స్‌వే హైవే లైన్ చెన్నైటు సూరత్ రోడ్డు ఉల్చాల, బసాపురం పొలాల మీదుగా వెళుతోందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు ప్రభుత్వం ఒక ఎకరకు రూ. 8 లక్షలు చొప్పున నష్టపరిహారంగా ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. ప్రస్తుతం ఇక్కడ మార్కెట్ విలువ ప్రకారం ఒక ఎకరాకు రూ.కోటి పలుకుతోందన్నారు. కనీసంరూ.60లక్షల ఇప్పించాలని కోరారు. కర్నూలు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, ఉల్చాల సర్పంచి విద్యాసాగర్, ఉల్చాల, బసాపురం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు కు వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి సఫియా ఖాతున్ శుక్రవారం తన స్వగృహంలో పూల బొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ సంబంధ పలు విషయాలను ఆమె ఆయన తో చర్చించారు. ఆమె మాటా ్లడుతూ షాదితోఫాలో కొన్ని నిబంధనలు సామా న్యులకు లబ్ధిని చేరకుండా అడ్డుపడుతున్నాయని వాటిని సవరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఇర్ఫాద్‌ఖాన్, ఖలేద్ హుస్సేన్, ఫర్ దిన్ ఖాన్, పర్వీన్ బేగం, సాదియా, నికత్ ఖాతున్ తదితరులు ఆయనను సన్మానించిన వారిలో ఉన్నారు.



సబ్సిడీ యంత్ర పనిముట్లకై త్వరలో నివేదిక

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలంలో ఆయా గ్రామాల్లో సబ్సిడీ కింద యంత్ర పనిముట్ల కోసం అర్జీలు పెట్టుకున్నవాటిపై తక్షణమే నివేదికలు పంపిస్తున్నట్లు ఎఒ మల్లేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆయా ఎరువుల, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఇక్కడే రైతులతో సమీక్షించి మాట్లాడారు. 50శాతం సబ్సిడీ కింద ట్రాక్టర్, పంపు సెట్లు ఇతర పరికరాలు రైతులకు ఎంతో అవసరమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అఫ్రిన్, ఊర్మిళ, వేంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగ,కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎస్ఇఇయు 327, 2023 సంవత్సరం వర్క్ మెన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలో పెండింగులో ఉన్న ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షులు కె.రాఘవేంద్ర ప్రసాద్, కార్యదర్శి ఎవి. రాఘవరెడ్డి కోరారు. ఎపి ఎస్ఇఇయు-327, 2023 వర్క్ మెన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం కర్నూలు నగరం ఎంఆర్‌పి కన్వెన్షన్ , సుంకేసుల రోడ్‌లో యూనియన్ సెక్రటరీ జనరల్ బలగ సాయికృష్ణ అధ్యక్షతన కర్నూలు రీజనల్ అధ్యక్షులు ఎస్.లక్ష్మీకాంత రెడ్డి, రీజనల్ సెక్రటరీ ఎస్.దామ్లానాయక్ , కర్నూలు డివిజనల్ ప్రెసిడెంట్ ఎస్.విజయభాస్కర్ , కర్నూలు డివిజన్ సెక్రటరీ సి.మధుకృష్ణల సారథ్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. అతిథులుగా ఎపిఇఎస్‌పిడిసిఎల్ , ఎపిఎస్‌పిడిసిఎల్ కంపెనీ ప్రాజెక్ట్స్ అండ్ ఐటి డైరెక్టర్ కె.శివప్రసాద రెడ్డి , ఆపరేషన్ సర్కిల్, కర్నూలు ఎస్ఇ ఎం .ఉమాపతి హాజరయ్యారు. యూనియన్ కంపెనీ అధ్యక్షులు కె.రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పెండింగ్ లో వున్న ఉద్యోగ కార్మికుల సమస్యలు, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, పెండింగ్ డిఎలు, పిఆర్‌సి, గ్రేడ్ 2 , జెఎల్ఎం సమస్యలు, సబ్ స్టేషన్ ఆపరేటర్ల సమస్యలు తదితర సమస్యలను త్వరలో పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ కంపెనీ కార్యదర్శి ఎంవి.రాఘవరెడ్డి కార్యక్రమానికి రాష్ట్ర కంపెనీ , జిల్లా , డివిజన్ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ఎపిఎస్ఇఇయు 327, 2023 వర్క్ మెన్ డైరీని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు

గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల ఎనిమిదో తేదీన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణపై అధికారులతో శుక్రవారం సునయన ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 29 పరీక్ష కేంద్రాలకు 29 మంది జిల్లా అధికారులను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాలను సందర్శించి, మౌలిక వసతులు ఉండేలా చూడా లన్నారు. జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్ష కేం ద్రానికి కేటాయించి నోడల్‌అధికారి సర్వీస్ కమిషన్ నిబంధనల పరిశీలించు కోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ నాగేశ్వరరావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిజిహెచ్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పారిశుధ్య కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం జీతాలు, పెండింగ్ జీతాలు, ఇపిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం జీతాలు, 3నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు నగర నాయకులు రామకృష్ణ అధ్యక్షతన కార్మికులు డ్యూటీ పాయింట్ నుండి సూపరింటెండెంట్ ఆఫీస్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.కృష్ణ, మహమూద్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కృష్ణ ప్రసంగించారు. విజయ్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పని విషయం గవర్నమెంట్ కు, ఏజెన్సీకి జరిగిన ఒప్పందం ప్రకారం రూ.16 వేల జీతాలు ఇవ్వకపోవడం ఇపిఎఫ్ జీతానికి తగ్గట్టు కట్టకపోవడం, ఇఎస్ఐ కార్డు అమలు చేయించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. వచ్చిన పేషెంట్లకు అటెండర్లకు ఇబ్బంది లేని పద్ధతిలో బాత్రూంలు, లెట్రిన్లు క్లీన్ చేయడం వార్డులను పరిశుభ్రంగా చేయడం, రోడ్లపై చెత్త చెదారం లేకుండా ఊడవడం చేస్తున్న కార్మికులకు సేఫ్టీ పరికరాలు డ్రెస్సులు, బ్లౌజులు, బూట్లు, పొరకలు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. పారిశుధ్య కార్మికులకు 3 నెలల జీతాలు ఇవ్వక పోవడం వలన కార్మికులకు కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. ఇండ్ల బాడుగ, కరెంటు బిల్లులు, కిరాణా షాపులలో అప్పులు, స్కూలు ఫీజులు కట్టడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. కొన్నిసార్లు కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జీతాలు అడిగితే వారిపై యాజమాన్యం వేదింపులకు గురిచేస్తూ, పని ఒత్తిడి పెంచు తున్నారని అన్నారు. సూపరిన్‌టెన్‌డెంట్‌కు, జిల్లా కలెక్టర్‌కుఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. జగనన్న ప్రభుత్వం ఫైనాన్స్ కమిషన్ తో అప్రూవల్ తీసుకుని ప్రభుత్వ హస్పటల్ పారిశుధ్య కార్మికులను అబ్కాకాస్ ఏజెన్సీలో కలిపి పనిభద్రత కల్పించడం లేదా పర్మినెంట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కాకపోతే రాబోయే కాలంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు.



నిరసనుద్దేశించి మాట్లాడుతున్న విజయకుమార్ , రామకృష్ణ




మాట్లాడుతున్న ఎంఎ.హఫీజ్‌ఖాన్

క్రీడాలను ప్రోత్సహించడమే లక్ష్యం: హఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ప్రతిభగల గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం మా లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని అవుట్డోర్ స్టేడియంలో 2వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ శాప్ లీగ్ పోటీలను జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ, ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పోటీలను ప్రారంభించారు. హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమం కోసం న్యాయవాది శ్రీధర్ రెడ్డి చేస్తున్న కృషి వెలకట్టలేనిది అన్నారు. శ్రీధర్ రెడ్డి లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు దాతలు ముందుకు వచ్చి క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకాలను ప్రోత్సహించేందుకు తనవంతు ఆర్థిక చేయూతకుఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. క్రీడా శాఖ ప్రధాన శిక్షకులు నటరాజరావు, కేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ కాశీరావు తదితరులు పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ప్రచురించిన 2023 సంవత్సరం స్టిక్కర్ క్యాలెండర్‌ను ప్రముఖగ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ అనేక ఉద్యమాలు పోరాటాలు చేయడమే కాకుండా సేవా, సాంస్కృతి, సామాజిక కార్యక్రమాలు చేస్తుందన్నారు. స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన విప్లవ యువకిశోరాలు భగత్ సింగ్ చంద్రశేఖర్ ఆజాద్ అల్లూరి సీతారామరాజు పుచ్చలపల్లి సుందరయ్య, చేగువేరా లాంటి గొప్ప వ్యక్తుల ఫోటోలతో ప్రతి సంవత్సరం క్యాలెండర్ ప్రచురించడం అభినందనీయమని అన్నారు. దేశభక్తి భావాలను యువతలో నింపడానికి డివైఎఫ్ఐ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. దేశంలో యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ , నిరుద్యోగం, అంతం డివైఎఫ్ఐ పంతం అనే నినాదంతో పనిచేస్తుందని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, జిల్లా నాయకులు రంగప్ప, అబ్దుల్లా , సుంకన్న, సూర్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు

- కమిషనర్ రఘునాథ్‌రెడ్డి


ఖాళీ ప్రదేశాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపాలిటీ స్థలాలు కబ్జా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలాలను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసలుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని 50 ప్రాంతాల్లో మున్సిపల్ ఖాళీ స్థలాలు ఉన్నాయని గుర్తించామని తెలిపారు. స్థలాలు కబ్జా కాకుండా విస్తీర్ణం హద్దుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఎపిహెచ్‌బి కాలనీ, టిజిఎల్ కాలనీ, ఎంఐజి, ఎల్ఐజి కాలనీ, హనుమాన్ నగర్, కల్లుబావి వీధి, విజయ భాస్కర్ రెడ్డి నగర్, రాయ నగర్ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయని తెలిపారు. ఆ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడకుండా హెచ్చరిక బోర్డులు, స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. మున్సిపాలిటీ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 20వ వార్డు సాయిబాబా నగర్ ప్రాంతంలో మున్సిపల్ స్థలంలో అక్రమ కట్టడాలను గుర్తించి 20 మందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. వాటిని కూల్చి వేసేందుకు ప్రణాళిక రచించామన్నారు. ప్రస్తుతం సాయిబాబా నగర్‌లోని మహబూబా టాకీస్ రోడ్డు ప్రాంతంలో కూల్చివేత జరుగుతోందని తెలిపారు. మున్సిపాలిటీ స్థలాలను సంరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

నాన్ వెజ్ అమ్మకాల వద్ద పరిశుభ్రత పాటించాలి

చికెన్, మటన్ విక్రయించే ప్రాంతాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చికెన్ విక్రయించేటప్పుడు హైజినిక్ పద్ధతిలో, ఎలాంటి క్రిమి కీటకాలు వాలకుండా గాజు గ్లాసు ఏర్పాటు చేసి విక్రయించాలని తెలిపారు. బహిరంగంగా ఉంచి విక్రయిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పరిశుభ్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, మేస్త్రి మహబూబ్ బాషా ఉన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి : ఎఒ


చిప్పగిరి ఆర్‌బికెలో రికార్డులను పరిశీలిస్తున్న

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి రైతూ వ్యవసాయ అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని ఎఒ ఆనంద్ సూచించారు. శుక్రవారం చిప్పగిరి రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులను, రైతులకు పంటల దిగుబడిపై అవగాహన కల్పిస్తున్నారా లేదా అని సమీపంలో ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఏ సమస్య వచ్చినా స్వగ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఏ విషయం తెలుసుకోవాలన్నా దగ్గరలోనే ఉన్న ఆర్‌బికెలకు వెళ్లి తెలుసుకోవచ్చని చెప్పారు. రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పిఎం కిసాన్ నిధులు త్వరలోనే మంజూరవుతాయన్నారు. ఆర్‌బికె అసిస్టెంట్ రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర జయప్రదం చేయండి

- టిడిపి మండల కన్వీనర్ వీరన్న గౌడ్

ప్రజాశక్తి - హోళగుంద

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 27న చేపట్టే 'యువ గళం' పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ వీరన్ గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 27న కుప్పం నుంచి ప్రారంభమై 400 రోజులు 4 వేల కిలోమీటర్లు వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధికి నోచుకోకుండా అప్పుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు. నిరుద్యోగ యువత ఇబ్బంది పడుతోందని, యువతకు, రాష్ట్ర ప్రజలకు అండగా ఉండేందుకు లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. టిడిపి పోల్ మేనేజ్‌మెంట్ సభ్యులు దిడ్డి సిద్ధప్ప, టిడిపి యువ నాయకులు హెచ్‌.జె.పవన్, దిద్ది తిక్కస్వామి, మల్లికార్జున, టిఎన్ఎస్ఎఫ్ మండల కార్యదర్శి మల్లికార్జున, మండల అధ్యక్షులు నాగరాజ్ పాల్గొన్నారు.

నేడు పింఛను వారోత్సవాలు

దేవనకొండ : దేవనకొండ ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శనివారం పింఛన్ల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గౌరీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పింఛనుదారులకు రూ.250 పెంచి కొత్త పింఛన్లను కూడా మంజూరు చేసిందని తెలిపారు. వాటిని అందించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు రానున్నట్లు చెప్పారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు హాజరు కావాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్


మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - ఆస్పరి

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిగిలి గ్రామంలో సర్పంచి జయమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు 15 ఏళ్లు అధికారంలో ఉండి రాష్ట్ర రైతులకు చేసిందేమీ లేదని తెలిపారు. వైసిపి అధికారంలోకి రాగానే రైతులకు రైతు భరోసా, నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని వాలంటీర్లను, అధికారులను ఆదేశించారు. సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైసిపి ఆలూరు తాలూకా ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన, ఎంపిడిఒ రాధ, ఎపిఒ కృష్ణమోహన్, ఎపిఒ రాఘవేంద్ర, వైసిపి సీనియర్ నాయకులు వెంకన్న, రామాంజనేయులు, కో కన్వీనర్ పురుషోత్తమ రెడ్డి, సర్పంచి హరికృష్ణ, బసవరాజు, తిమ్మప్ప, శివ, లక్ష్మన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

చిగిలి సర్పంచి మండలానికి ఆదర్శం : మంత్రి

చిగిలి సర్పంచి జయమ్మ మండలానికి ఆదర్శమని మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. మంత్రి మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలో నిధులు లేకపోయినా సర్పంచి జయ్యమ్మ సొంతంగా రూ.70 లక్షలు ఖర్చు పెట్టి గ్రామంలోని ప్రతివీధికి పైపులైన్, ఇంటింటికి కుళాయి, పొలాలకు వెళ్లే రహదారులకు మట్టి వేయించారని తెలిపారు. రూ.25 లక్షలతో స్టోరేజ్ ట్యాంక్ నిర్మించారన్నారు. సర్పంచి మాట్లాడుతూ... తమపై నమ్మకం ఉంచి 2019 ఎన్నికల్లో సర్పంచి, తనయుడు రాధాకృష్ణను ఎంపిటిసిగా గెలిపించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.


డిమాండ్ నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

ట్రాన్స్‌పోర్ట్ హమాలీల కూలి రేట్లు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని వివిధ ట్రాన్స్‌పోర్ట్‌లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని ఆదోని పట్టణ ట్రాన్స్ పోర్ట్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు లక్ష్మణ్, కార్యదర్శి వెంకటేశులు డిమాండ్ చేశారు. శుక్రవారం ట్రాన్స్‌పోర్ట్ ఏజెంట్స్ వారికి హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు ఏ మాత్రం సరిపోవడం లేదని తెలిపారు. నిత్యం బరువులు మోస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులు రాజు, షాషావలీ, ముని పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా... పేదలకు వరం

- 21వ వార్డు కౌన్సిలర్ లక్ష్మిదేవి

ప్రజాశక్తి - ఆదోని

వైఎస్ఆర్ బీమా నిరుపేదలకు వరంలాంటిదని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని 21వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం సచివాలయ ఆవరణంలో మహాత్మ గాంధీ నగర్‌కు చెందిన ఇద్దరు మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సహజ, ప్రమాదవశాత్తు మరణించిన నిరుపేద కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. సహజ మరణం పొందితే రూ.లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని తెలిపారు. వార్డు ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సెక్రటరీలు రాముడు, రవికుమార్, వీర ఉన్నారు.


బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్

స్టేట్‌మీట్ కబడ్డీ జట్టుకు ఆదోని క్రీడాకారుడు

ప్రజాశక్తి - ఆదోని



ఈనెల 5న కర్నూలు నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి శాప్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆదోని పట్టణానికి చెందిన బండారి రాజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.అమర్ ప్రకాష్, కార్యదర్శి యు.రవి కుమార్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు బండారి రాజును అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 7, 8న నెల్లూరులో జరిగే స్టేట్‌మీట్‌లో బండారి రాజు ప్రతిభ చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

పేదలందరికీ ఇల్లు...

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇస్తుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని 52 బసాపురం గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు నెల్లూరుకు చెందిన జెఎస్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించి ఇచ్చే విధంగా ఒప్పందం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి రాఘవరెడ్డి, హౌసింగ్ డిఇ లాలీ కృష్ణయ్య, ఎస్ఐ కిరణ్ బాబు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- 'గడప గడపకు'లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి, వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. శుక్రవారం స్థానిక జడ్‌పిటిసి మజ్జిగ గోవిందమ్మ కుమారుడు రోగప్ప, నాయకులు బొజ్జప్ప ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ పథకాల చిట్టాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను, కుటుంబాల నుంచి వచ్చిన సమస్యల వినతులకు సంబంధించిన అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలతో పాటు గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలని ఆదేశించారు. అంతకుముందు రచ్చుమర్రి గ్రామానికి చేరుకున్న వారికి స్థానిక నాయకులు గజమాలను క్రేన్ సహాయంతో వేశారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి మేకల సుజాత పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను, యువనేతను గజమాల వేస్తున్న నాయకులు

సిపిఎం సీనియర్ సభ్యుడు మృతి

ప్రజాశక్తి - ఆదోని



పట్టణంలోని కల్లుబావి వీధికి చెందిన సిపిఎం సీనియర్ సభ్యులు, కొఠారి మిల్లు కార్మికుడు ప్రహ్లాద (70) మృతి చెందాడని సిపిఎం నాయకులు తెలిపారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ప్రహ్లాద చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. కొఠారి మిల్లు కార్మికునిగా ఉంటూ గతం నుంచి పార్టీ సభ్యుడుగా ఆయన సిపిఎంలో కొనసాగుతూ తన వంతు పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన మృతి పట్ల సిపిఎం నాయకులు రాధాకృష్ణ, రామాంజనేయులు, లక్ష్మణ్, ఈరన్న, మహానంది రెడ్డి, గోపాల్, ముక్కన్న, నాగరాజు, తిప్పన్న సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


రథోత్సవంలో పాల్గొన్న టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, దివాకర్ రెడ్డి

వైభవంగా అంబా భవాని మహా రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని అర్లబండ గ్రామంలో వెలసిన శ్రీఅంబా భవాని దేవి జాతర, రథోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ముందుగా పీఠాధిపతి శ్రీమఠ్రిస్వామి తాత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా రథోత్సవంలో పాల్గొన్నారు. పాలకుర్తి తిక్కారెడ్డికి గ్రామ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పీఠాధిపతి శ్రీమఠ్రిస్వామి తాత పాలకుర్తి తిక్కారెడ్డిని, దివాకర్ రెడ్డిని ఆశీర్వదించి, శాలువా, పూలమాలతో సన్మానించారు.

శ్రీకౌలుట్లచెన్నకేశవస్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- దేవనకొండ

కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన కౌలుట్ల చెన్నకేశవస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం దేవదాయశాఖ సిబ్బంది చేపట్టారు. ఆలయ ఇఒ చంద్రశేఖర్ రెడ్డి, ఛైర్మన్ హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టగా మొత్తం రూ.1,82,411 ఆదాయం వచ్చింది. గతేడాది రూ.1,74,000 ఆదాయం రాగా ఈఏడాది స్వల్పంగా ఆదాయం పెరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, దేవాలయ సిబ్బంది శ్రీను, సురేష్, చంద్ర, కోటకొండ సచివాలయ కన్వీనర్ లక్ష్మణ స్వామి, డిష్ వెంకటేష్, దస్తగిరి, కోలంట్ల విశ్వనాథ్, భక్తులు, శివస్వాములు పాల్గొన్నారు.


హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

7, 8న వ్యకాస జిల్లా మహాసభలు

- జిల్లా ఉపాధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

ఈనెల 7, 8న కోడుమూరులో జరిగే వ్యకాస 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బి.వీరశేఖర్, మండల కార్యదర్శి మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు తెర్నేకల్ బజారి, యూసుఫ్ బాషలు కోరారు. శుక్రవారం దేవనకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి రోజురోజుకూ కరువవుతోందని తెలిపారు. ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు బాధ్యతను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. వలసలు పెరుగుతున్నాయని, వలసల నివారణపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఉపాధి హామీచట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా నిబంధనల పేరుతో కూలీలకు ఉపాధిని దూరం చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించాలని వ్యకాస ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని చెప్పారు. ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. వ్యకాస 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, 7న కూలీల ప్రదర్శన, 8న ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా వ్యకాస అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు హాజరవుతారని చెప్పారు. కూలీలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయలని కోరారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.తిమ్మన్న, మండల అధ్యక్షులు ఏసేపు, మండల నాయకులు గిడ్డన్న, ఏసన్న మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

తెర్నేకల్లులో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి- దేవనకొండ


అపరిశుభ్రత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో సరస్వతి అనే మహిళకు డెంగీ వ్యాధి సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శుక్రవారం డెంగీ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో అపరిశుభ్రత ప్రాంతాలను పరిశీలించారు. డెంగీ కేసు నమోదయిన ఇంటి పరిసరాల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించారు. గ్రామంలో డ్రై డే కూడా పాటించినట్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన గ్రామస్తులను కోరారు. హెల్త్ డైరెక్టర్ ఈశ్వరయ్య, సూపర్ వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఏడాదిగా జీతాల్లేవు...

- స్వచ్ఛభారత్ అంబాసిడర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే వారికే ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, తమకు ఏడాదిగా జీతాల్లేవని స్వచ్ఛభారత్ అంబాసిడర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చిప్పగిరి గ్రామ సచివాలయంలో సర్పంచి గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి నాగభూషణంకు గ్రీన్ అంబాసిడర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమకు పెండింగ్‌లో ఉన్న సంవత్సరం జీతాలివ్వాలని, కనీస వేతనం రూ.16 వేలు చేయాలని కోరారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం, గ్రీన్ అంబాసిడర్స్ పని చేసేందుకు గ్లౌజులు, బూట్లు, పనిముట్లు ఇవ్వాలని తెలిపారు. స్వచ్ఛభారత్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సర్పంచి గోవిందరాజులు స్పందిస్తూ... ఈ సమస్యలను ఉన్నతాధికారులకు తెలుపుతానని తెలిపారు.


సర్పంచికి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బెంగళూరు వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేత

ప్రజాశక్తి - చిప్పగిరి

రామదుర్గం వాలంటీరు సుంకన్న బెంగుళూరుకు వెళ్లి వడ్డే వెంకటలక్ష్మి అనే వృద్ధురాలికి పింఛను అందజేశారు. శుక్రవారం వాలంటీరు సుంకన్న మాట్లాడారు. మండలంలోని రామదుర్గం గ్రామానికి చెందిన వడ్డే వెంకటలక్ష్మి బెంగళూరులో కుమార్తె వద్ద ఉందని తెలుసుకొని, పింఛను తీసుకోవడానికి రాలేని పరిస్థితిలో ఉన్నందున తానే బెంగళూరుకు వెళ్లి అందజేసినట్లు తెలిపారు. వృద్ధురాలి బంధువులు మాట్లాడుతూ... బెంగళూరుకు వచ్చి పింఛను అందజేసినందుకు వాలంటీరు సుంకన్నకు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పర్యటనలను చూసి జగన్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, పల్లెపాడు రామ్ రెడ్డి, ముత్తు రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిరుతపల్లి, మల్లన్నహట్టి గ్రామాల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూడున్నర ఏళ్లకే అధికార పార్టీపై ప్రజా వ్యతిరేకత మొదలైందని తెలిపారు. రాజధాని లేని రాష్ట్రంగా, అభివృద్ధికి ఆమడ దూరంలో రాష్ట్రం ఉండడం దురదృష్టకరమని చెప్పారు. నకిలీ విత్తనాలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, అధిక వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగన్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏ ప్రభుత్వంలో కూడా పడలేదని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిద్ధప్ప, దర్గా మౌలా, మల్లప్ప, రామలింగ, అల్లయ్య, కోసిగి మండల నాయకులు నర్సారెడ్డి, శంకర్ రెడ్డి, బుజ్జి, తిక్కయ్య, ఈరన్న, సొట్టయ్య, జోల్లా కోసిగయ్య, వెంకటేష్, లక్ష్మిరెడ్డి, నరసన్న పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

జీవోను 1ని రద్దు చేయాలి:విజయకుమార్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే జీవో నెంబర్ ఒకటిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ కోడుమూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి పాలకవీటి విజయకుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు నియంత్రణకు జారీ చేసిన జీవోను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నాడు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనకుండా మన హక్కులను అణిచివేయడానికి 162 ఏళ్ల కిందటి పోలీస్ యాక్ట్ 30, 1861 లో బ్రిటిష్ వాళ్ళు పెట్టిన చట్టం ఆధారంగా ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం మన రాష్ట్రంలో అమలు చేస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేష్,పవన్ కళ్యాణ్ లక్ష్యంగా జీవోను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడమే అవుతుందని, ఇలాంటి జీవోలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, ప్రజా హక్కులకు, ప్రమాదమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యవాదులు ఎవరు హర్షించరన్నారు. కందుకూరు, గుంటూరు, ఘటన ఆధారంగా రాష్ట్ర మున్సిపల్ , పంచాయతీ రోడ్లలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. చరిత్రలో ఇలాంటి వింత జీవోలు రాలేదని అన్నారు. అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షాలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికే కార్మికులు, రైతులు, ప్రజలు, ఉద్యోగస్తులు తమ కోర్కెలు హక్కులకు ఆందోళనలు చేయకుండా వైసిపి ప్రభుత్వం పోలీసులు 30 యాక్ట్ పేరుతో ముందస్తు అరెస్టు చేసి తమ హక్కులకు భంగం కలిగిస్తుందని అన్నారు.



దోమల నివారణకు సూచనలు చేస్తున్న డాక్టర్ నగేష్ బృందం

దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి-మద్దికెర

మద్దికెర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సచివాలయ పరిధిలోని స్థానిక బెస్త వీధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారి నాగేష్ తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ వారానికొకసారి దోమలు గుడ్లు పెట్టే నీటి నిల్వలను తొలగించాలని ఒక చిన్న దోమ జీవితాన్నే మార్చేస్తుందని, మలేరియా, డెంగీ దోమలు మంచి నీటిలో మాత్రమే గుడ్లు పెడుతుందని, పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత, పాడై పోయిన నీటి తొట్లు, బకెట్, టైర్లు, బాటిల్, కొబ్బరి చిప్పలు తీసివేయాలి, పరిసరాల పరిశుభ్రత దోమల పెరుగుదలను అరికడుతుందని, ప్రతి ఒక్కరు దోమతెరలు, వేపాకు పొగ వేసుకోవాలి, పరిశుభ్రతే అయుధమని దోమల పై యుద్ధం ప్రతి ఫ్రై డే డ్రై డే పాటించాలని, ఆపరేషన్ దోమలో ఇంటి లోపల, ఇంటి బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల పోరాటంలో ఆశా, ఆరోగ్య, పారిశుధ్య కార్మికులు, పిహెచ్‌సి సిబ్బంది కలిసి సక్రమంగా విధులు నిర్వహించాలని వారికి ప్రజలు కూడా సహాయ సహకరణ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, కమ్యూనిటీ హెల్త్ నర్స్ సరస్వతి, హెల్త్ సూపర్ వైజర్ సూర్య నారాయణ, కృష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్ రావు, లక్ష్మిదేవి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్య కర్తలు పాల్గొన్నారు.



భారాల వైసిపిని సాగనంపాలి: టిడిపి

ప్రజాశక్తి-తుగ్గలి

రాష్ట్ర ప్రజలపై మోయలేని భారాలు వేసే వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని మారెళ్ల గ్రామంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపాల్ నాయుడు మాట్లాడుతూ సిఎం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనను అందిస్తున్నారన్నారు. త్వరలోనే అరాచక పాలనకు స్వస్తి పలుకుతామన్నారు. ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిన ఏకైక వైసిపి ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అరాచక పాలన కొనసాగుతుందన్నారు. గ్రామాలలో పేదలను పట్టించుకునే పాపాన పోలేదన్నారు. ఉన్న బియ్యం కార్డులను కూడా తొలగించారన్నారు. మాజీ ఎంపిటిసి వెంకటరాముడు, టిడిపి నాయకులు దేవర ఇంటి వెంకటరాముడు, ప్రతాప్ యాదవ్, రాచకృష్ణప్ప, మంకీ మహేష్, శ్రీరాములు, భాస్కర్ గౌడ్, మర్రి లక్ష్మన్న పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మునీరుద్దీన్, బాలమద్దయ్య

నేడు వైద్య పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కళాశాల అల్యుమినీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ ఎస్.మునీరుద్దీన్ అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం వైద్యకళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల్లో కర్నూలు మెడికల్ కళాశాల ప్రారంభ బ్యాచ్ 1956 నుంచి నేటి వరకు ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన వారందరితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, హైదరాబాద్‌లోని ఏషియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి, విజయవాడ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ బి. సాంబశివారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. ఇక్కడ చదివి దేశవిదేశాల్లో స్థిరపడిన వైద్యులు తమ అనుభవాలను పంచుకోనున్నారు. దాదాపు 700 మందికి పైగా వైద్యులు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రెజరర్ డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ ప్రేమ్ కిశోర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ మహేంద్ర పాల్గొన్నారు.

ఇనాం భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి -తుగ్గలి : మండల పరిధిలోని శభాష్పు గ్రామంలో రంగస్వామి ఈనాం భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ప్రజలు శుక్రవారం విఆర్‌ఒ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 88 సర్వేనెంబర్‌లోని భూమిని అదే గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నాడని, అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామ పంచాయితీ శభాష్ పురము రుద్రభూమి మరియు రంగస్వామి మాన్యం భూమిని ఆక్రమించుకుంటున్నారన్నారు. రంగస్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న మాన్యం భూమిని ఆక్రమించుకోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మండల రెవిన్యూ అధికారులు ఆ రైతుపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పలు ఆరోగ్య కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రాష్ట్ర విజిలెన్సు , ఎన్ ఫోర్సుమెంటు డైరక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఉమ్మడి జిల్లాల ఎస్‌పి తిరుమలేశ్వర్ రెడ్డి అన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలలోని ప్రభుత్వ ఆసుపత్రులలో విజిలెన్సు అధికారులు డిఇ గుణకరరెడ్డి, సిఐ శ్రీధర్, ఎఫ్ఆర్‌ఒ అలీఖాన్, ఎఎఒ షణ్ముఖ గణేష్, ఎజి. సిద్దయ్య, ఎఇ లు చంద్ర శేఖర్, శ్రీనివాసరావు, ఎస్‌ఐ హనుమంతయ్య, జీవేషులు వేర్వేరు చోట తనిఖీలు చేశారు.

కర్నూలు జిల్లా వెల్దుర్తి పి హెచ్ సి లో: ఇక్కడ రూ. 5.7 కోట్లతో నిర్మణం పూర్తి కావచ్చిన ఆసుపత్రి బిల్డింగును సందర్శించారు. ప్రస్తుతం వున్న ఆసుపత్రి చాలా చిన్నగా వున్నందున ఓపి తదితర సౌకర్యాలు లేవని, ఆరుగురు నర్సు పోస్టులు ఖాళీగా వుండటం గమనించా మనీ అన్నారు. కోడుమూరు సిహెచ్ సిలో: ఇక్కడ సిహెచ్‌సిలో సాంకేతిక కారణాల వలన ఫేస్ యాప్‌ను అటెండెన్స్ మార్క్ చేయడంలో సమస్యలు గుర్తించామన్నారు. డ్రగ్ రిజిస్టర్ అక్టోబర్ వరకే అప్డేట్ చేయడం గుర్తించామన్నారు.



నంద్యాల జిల్లాలోని గోస్పాడు పి హెచ్ సి లో : డ్రగ్ రిజిస్టర్ సెప్టెంబర్ 2022 వరకే అప్డేట్ చేయడం గుర్తించా గుర్తించామన్నారు. ఎసిబి టోల్ ఫ్రీ నెంబర్ లేకపోవడం గమనించామన్నారు.

వెలుగోడు సిహెచ్ సి లో :ఫార్మసిస్ట్ డ్రగ్ రిజిస్టర్ అసలు మెయింటైన్ చేయలేదన్నారు. జనని సురక్ష యోజన రిజిస్టర్ లో మెడికల్ ఆఫీసర్ సంతకాలు లేకపోవడం గుర్తించామన్నారు.

జగనన్నది పేదల ప్రభుత్వం : ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం 44వ వార్డ్ మున్సిపల్ పార్క్ రామలింగేశ్వర నగర్ ఎపి టూరిజంలో వైఎస్ఆర్ పించన్ కనుక కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు అడ్వాన్స్ సంక్రాత్రి శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలు ఉన్న ఏ ఒక్కరికి పెన్షన్ రద్దు కాదని, ఎంత మందికైనా పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని' ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 25 లక్షల మంది పేదలకు పెన్షన్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల పరిస్థితి, ఇప్పటి పరిస్థితిని ఒకసారి ఆలోచించాలన్నారు. పెన్షన్ కోసం పడిగాపులు కాసే రోజులు పోయాయన్నారు. ప్రతి నెల 1వ తేదీ పెన్షన్ లబ్ధిదారులకు అందుతోందన్నారు. పెన్షన్లతో పాటు ఇతర అన్ని సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలియజేశారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు ప్రతి ఏడాది పెన్షన్ మొత్తం పెంచుతున్నారని, సంక్రాంతి కొత్త పెన్షన్లను అందజేస్తున్న పండుగకు ముందే పెన్షన్ దారులందరికి రూ.2500 నుంచి రూ.2750లు మంజూరు చేశారన్నారు. మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందిస్తు న్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర, 42వ వార్డ్ ఇంచార్జి శ్వేతా రెడ్డి, 47వ వార్డ్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ నాయకులు అరుణ, 43వ వార్డ్ రాజేష్ ,44వ వార్డ్ కార్పొరేటర్ రాజేశ్వర్ రెడ్డి, 45వ వార్డ్ జనార్దన్ రెడ్డి, 46వ వార్డ్ కార్పొరేటర్ వాసు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సెల్ మెంబెర్ ప్రభుదాస్, రైల్వే ప్రసాద్, అది మోహన్ రెడ్డి, జమ్మన్న, 45 వ వార్డ్ కార్పొరేటర్, వైసిపి నాయకులు వాహేదా, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు , ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ ఎం నాగమణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు పరిధిలో ఉయ్యాలవాడ.1 బిసి.బి, ఆర్‌కాలనీ, ఎస్సీ కాటగిరిలో కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జి సింగవరం బిసి. బి, గార్గేయపురం బిసిసి, ఓర్వకల్-ఓసి, నన్నూరు ఇడబ్ల్యూఎస్ బొల్లవరం ఎస్‌టి, చిన్నటేకూరు ఒసి క్యాటగిరిలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా తమ దరఖాస్తులను పెద్దపాడులోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

10న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సంక్రాంతి ఆటల పోటీల్లో భాగంగా ఈనెల 10న కర్నూలు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు బి.తాండ్రపాడు సర్పంచి ఆకెపోగు జయన్న అన్నారు. ఈనెల తొమ్మిదవ తేదీన జట్లకు సంబంధించి డ్రా తీస్తామన్నారు. 10వ తేదీ ఉదయం 8 గంటలకు టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా కర్నూలు మండల మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. పోటీలో మొదటి బహుమతి కింద రూ.20,016, ద్వితీయ బహుమతి కింద రూ.10,016 విజేతలకు అందజేస్తారన్నారు. మొదటి బహుమతికి తాను స్పాన్సర్ చేయగా, ద్వితీయ బహుమతికి చాంద్ బాషా స్పాన్సర్ చేశారన్నారు. టోర్నమెంట్లో పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు కింద రూ.600 చెల్లించాలన్నారు. ఆటకు ఉపయోగించిన బంతి డబుల్ టెన్నిస్ బాల్‌ను ఉపయోగించాలన్నారు. మ్యాచులు ప్రారంభానికి అరగంట ముందు గ్రౌండ్లో క్రీడాకారులు ఉండాలన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఇవ్వనున్నామన్నారు. ఎవరి కిట్టు వారే తెచ్చుకోవాలన్నారు. ఆటలో ఎంపైర్ దే తుది నిర్ణయం అన్నారు. ఒక జట్టులో ఆడిన క్రీడాకారుడు మరో జట్టులో ఆడకూడదన్నారు. బంతిని యాజమాన్యం వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఫైనల్ మ్యాచ్ విజేతలకు భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేశామన్నారు. టోర్నమెంట్లో పాల్గొనదలచిన జట్లు తమ పేర్లను టోర్నమెంట్ ఆర్గనైజర్లు పూల రామకృష్ణ, పేరపోగు ఏసు సెల్ నెంబర్ 9502447726 గాని, మల్లె పోగు పెద్దయ్య సెల్ నెంబర్ 8247859626లో గాని సంప్రదించాలని కోరారు.

అందరి సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కషి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని 8వ వార్డ్ పెద్ద పడాఖానా 21వ సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైస్సార్సీపీ ప్రభుత్వం కషి చేస్తుందని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు జిల్లా వక్ఫ్ బోర్డు మెంబర్ అబ్రార్, షాకీర్,



ఫరూక్,కో-ఆప్షన్ మెంబెర్ నయీమ్ పాషా,యూసుఫ్, బసిత్, మాజీ కార్పొరేటర్ శేషన్న, నూరుల్లాహ్ సాహెబ్, హకీమ్ భాయ్,షాకీర్,శ్రీను,ముస్తక్ హుస్సేన్, కిరణ్,అశ్రాఫ్, వైసిపి నాయకులు కార్యకర్తలు, అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణం పరిరక్షణ, పచ్చదనం పట్టని మున్సిపల్ ఇంజనీర్లు

పట్టణ పౌరసంక్షేమ సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు పచ్చదనం అభివృద్ధిపై మున్సిపల్ ఇంజనీర్లు పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. వర్షం నీరు భూమిలో చేరాలనే కనీసమైన శాస్త్రీయ దృక్పథాన్ని కూడా కోల్పోతున్నారు. పర్యావరణ పరిరక్షణ పట్టణ పౌర సంక్షేమ సంఘాల ప్రతినిధులు రామలింగేశ్వర నగర్ లో రూ.కోటితో జరిగే రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు.



పర్యావరణ పరిరక్షణ సంఘం ప్రతినిధి టి.హరికష్ణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు ఎం.యాకోబు,ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా అభివృద్ధి అయినా దేశాల(ఫారిన్)లో లాగా డ్రైన్‌టు డ్రైన్ సిమెంట్ రోడ్లు వేస్తా ఉన్నారు. చెట్లు నాటేందుకు, ఫుట్పాత్ నిర్మించేందుకు,పైపులైను వేసేందుకు స్థలం వదలకుండా రోడ్డు వేస్తున్నారన్నారు. వర్షం నీరు భూమిలోకి చేరాలని(ఇంకాలనే) శాస్త్రీయ దకృథాన్ని కూడా మున్సిపల్ ఇంజనీర్లు కోల్పోతున్నారని విమర్శించారు. వీరి అనాలోచిత చర్యల వల్ల పర్యావరణం, పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన ప్రజాధనానికి కూడా నష్టం జరుగుతుందన్నారు. కమిషనర్ జోక్యం చేసుకోని పచ్చదనం పర్యావరణం ప్రజాధనం వృధాపై చర్యలు చేపట్టాలని కోరారు.

వార్డు కార్పొరేటర్ ఎం రాజేశ్వర్ రెడ్డి హామి: ఈ సమస్యపై సంఘాల సభ్యులు వార్డు కార్పొరేటర్ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. చెట్లు నాటేందుకు ఒకటిన్నర అడుగు స్థలం వదిలిపెట్టి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎం .నాగరాజు,పి.ఇక్బాల్ సివి. వర్మ,ఎస్ .రమణ గౌడ్, కె. శీను ఉన్నారు.



నిడ్జూరు గ్రామంలో డిఇఒ వెంకటరంగారెడ్డి

టెన్త్ లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

టెన్త్ పరీక్ష ఫలితాల్లో మూడు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట్ రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలంలోని నిడ్జూరు గ్రామంలో నైట్ విజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ గ్రామంలోకి వెళ్లి విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు టీవీలు సెల్ఫోన్లకు దూరంగా పెట్టాలని తల్లిదండ్రులను కోరారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాటుపడాలన్నారు.



బాధితులను పరమార్శిస్తున్న కె.ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌దేశాయి, రామాంజనేయులు

హోసూరు బాధితులను పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పత్తికొండ లో ఎస్ఎఫ్ఐ నాయకుడు మధు పై వైసిపి నాయకుడు బాబుల్ రెడ్డి దాడి చేశారు. ఈ సంఘటనలో గాయపడిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి చేసిన వైసిపి నాయకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పెండేకల్లులో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి తుగ్గలి

మండలం పరిధిలోని పెండేకల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంజూరైన మినిరల్ వాటర్ ప్లాంట్ ను సర్పంచి లీలావతి, వైసిపి నాయకులు అట్లా బసిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి పాఠశాలకు మినరల్ ప్లాంట్‌ను మంజూరు చేయటం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన నీటిని అందిస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో ఇలాంటి కార్యక్రమాలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి పత్తికొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం హర్షించ తగ్గ విషయమన్నారు. పంచాయితీ కార్యదర్శి అంకాలప్ప, విద్యా కమిటీ చైర్మన్ గౌరప్ప, సచివాలయం కన్వీనర్ రంగన్న,హెచ్ఎ, విద్యార్థులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న సర్పంచి లీలావతి

అర్‌యు సూపరిన్‌టెన్‌డెంట్ పై కేసు నమోదు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై , ఎస్సీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయలసీమ యూనివర్సిటీ సూపరిన్‌టెన్‌డెంట్ ఇస్మాయిల్ పై తాలూకా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. గత ఐదు రోజుల క్రితం ఇస్మాయిల్ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు ఫోన్ చేసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తో పాటు ఎస్సీలలోని ఓ ఉపకులంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఫోన్లో రికార్డింగ్ కావడంతో అన్ని గ్రూపుల్లో ఇటీవల వైరల్ అయింది. సదరు ఇస్మాయిల్ ఫోన్లో సంభాషించిన వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ విజయభాస్కర్ అనే వ్యక్తి తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సదరు సూపరిండెంట్ ఇస్మాయిల్ పై పోలీసులు విచారణ చేపట్టారు. ఇస్మాయిల్‌ను వెంటనే విధుల్లో నుండి తొలగించాలని దళిత ప్రజా సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆదోనిలోని కపటి గ్రామ ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు డి.వెంకటేశ్వర్లును డిఇఒ వెంకట రంగారెడ్డి శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా అదనంగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి.వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించడం పట్ల సస్పెండ్ చేస్తున్నట్లు డిఇఒ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోనీ కొత్తకోట -4 ఇడబ్ల్యూఎస్, కొత్తకోట -3ఒసి, తిమ్మందొడ్డి - ఒసి, బెళగల్ -6 ఒసి, బ్రాహ్మణదొడ్డి -1 ఎస్‌సి, మారందొడ్డి -2 ఎస్‌టి వంటివి ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయని సి డిపిఒ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం నోటిఫికేషన్‌ను జారీ చేసి మాట్లాడారు. తప్పనిసరిగా పదవతరగతి పాసై నేటితో 21 సంవత్సరాలు పూర్తయి 35 సంవత్సరాలలోపు ఉండాలని అన్నారు. ఈ నెల 10న 5 గంటలలోపు కోడుమూరులోని తమకార్యాలయంలో దరఖాస్తులను చేర్చాలని పేర్కొన్నారు.


మహిళల రక్షణలో పాలకులు విఫలం : ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళల రక్షణలో పాలకులు విఫలమయ్యారని ఐద్వా నాయకులు అన్నారు. కేరళ రాష్ట్ర తిరువనంతపురంలో జరుగనున్న ఐద్వా 13వ అఖిలభారత మహాసభలు విజయవంతం కావాలని కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు నందు గల గూడెంలో 45వ వార్డు భగత్ సింగ్ నగర్ లో 48వ వార్డు అమీర్ హైదర్ ఖాన్ నగర్ లో ఐద్వా జండాలను ఎం. కుమారి, ధనలక్ష్మి , బాలలక్ష్మీల అధ్యక్షతన ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల. ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దేశంలోనూ ,రాష్ట్రంలోనూ మహిళలపై జరుగుతున్న హత్యలు ,అత్యాచారాలు, దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని అన్నారు. పేరుకు మాత్రం బేటి పడావో, బేటి బచావో అనే అందమైన నినాదాలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదని అన్నారు. ఈనెల 6 నుండి 9 వరకు జరుగుతున్న ఐద్వా అఖిలభారత మహాసభల్లో మహిళల రక్షణ కోసం, మహిళల ఉపాధి కోసం, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్స్ కల్పించడం కోసం చర్చించి పోరాటాలకు రూపకల్పన చేయబోతున్నామని అన్నారు. దేశంలో మతోన్మాదం పేరుతో జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్చించబోతున్నామని, రోజురోజుకు ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఐద్వా తీసుకోబోయే పోరాటాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పిఎస్. సుజాత, సావిత్రమ్మ, పర్వీన్,మౌలాబి,ముత్తంబీ , నాగలక్ష్మి, సత్యమ్మ శిరీష , శాంతమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.



జండావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.నిర్మల





మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్

భూ రికార్డుల స్వచ్ఛీకరణపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో భూ తగాదా సమస్యలను పరిష్కరించి భూ రికార్డుల స్వచ్ఛీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ ఆర్డీఓలు, తాసిల్దారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతితో కలిసి భూ హక్కు పత్రాల పంపిణీ, మ్యుటేషన్ దరఖాస్తులు, పిఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, 90 రోజుల ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై అన్నితాసిల్దారులు, ఆర్డీవోలతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూఆక్రమణలు, రెవిన్యూ రికార్డులో సవరణలు, పట్టాదారు పాసు పుస్తకాల మంజూరులో లోపాలు తదితర అంశాలపై ప్రజల నుండి అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని,వీటన్నిటిపై ప్రత్యేక దృష్టి సారించి లిక్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి భూ రికార్డుల స్వచ్చీకరణకు రెవెన్యూ అధికారులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, జెసి

చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాల్యుయేషన్, సమగ్ర రీ సర్వే తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి మ్యూటేషన్ కరెక్షన్స్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలన్నారు. భూ రీసర్వే, ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీకి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ మండల తాసిల్దార్లను ఆదేశించారు. స్పందన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి 39 రీఓపెన్ దరఖాస్తులు, విత్ ఇన్ ఎస్ఎల్ఏ లో ఉన్న 775 దరఖాస్తులు, ఎపీ సేవా సర్వీసులు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న 414 దరఖాస్తులను నిర్ణీత కాల గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీకి సంబంధించి స్మశాన వాటిక లకు ప్రభుత్వ భూములను గుర్తించి సోమవారంలోగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల లభ్యం కాని పక్షంలో దాతలను గుర్తించాలని ఆమె సూచించారు. జాతీయ రహదారులు 340సి, 340బి, 167 లకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్ ఫైల్ అయిన కేసులు, కంటెంప్ట్ కేసులు, ఫైనల్ ఆర్డర్ కేసులు కొత్త కేసులపై పూర్తిస్థాయి దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల తహసీల్దార్లు, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

పెట్టుబడిదారులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నందికొట్కూరు వైష్ణవి కాలేజీలో సిపిఎం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోవడం పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఉద్యోగ, కార్మికుల వేతనాలు పడిపోయాయని వారు తెలిపారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేసి కార్మిక హక్కులను పెట్టుబడుదారులకు అనుగుణంగా మార్పులు చేయడం జరుగుతుందని వారు ఆరోపించారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే ఓటు, ఒకే భాష, ఒకే తిండి, ఒకే బట్ట కట్టాలని హిందూ ముస్లిం క్రిస్టియన్ మతాల మధ్యన వైశ్యమాల పెంచి మత రాజకీయాలకు బిజెపి ప్రభుత్వం పాల్పడుతుందని వారు మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరుతో అభివృద్ధి కార్యక్రమాలను విస్మరించారని అన్నారు. ప్రజా ఉద్యమాలను అణచి వే సేందుకు జీవోలు తీసుకొని రావడం విచారకరమన్నారు. 200 యూనిట్లు విద్యుత్ వినియోగించే గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించబోతున్నారని రైతు బోర్లకు మీటర్లు బిగించేందుకు రాష్ట్ర సర్కార్ సిద్ధమవుతుందన్నారు. అర్హులైన నిరుపేదల పింఛన్లను తొలగించారని పేర్కొన్నారు. పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పి వెంకటేశ్వర్లు, పి పకీర్ సాహెబ్, టి ఓబులేసు, గోపాలకృష్ణ, ఈశ్వరమ్మ, సంపంగి వెంకటేశ్వర్లు, ఆర్ జయరాన్ని, రంగమ్మ, హుస్సేన్, అమ్మ రాంరెడ్డి, ఎం కర్ణ, ఏసన్న, సోడా బిబి రామకృష్ణ, లింగస్వామి, మౌలాబి, తదితరులు పాల్గొన్నారు.

పోలీలసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

-జిల్లా ఎస్పి కె . రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ప్రాధాన్యతని ఇస్తామని జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి అన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మొత్తం 10 మంది మ్యూచువల్ బదిలీలు , మెడికల్ గ్రౌండ్స్ , రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధి త జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పితో పాటు డిపిఓ ఏఓ జి.నిజాం ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బంది నుండి గ్రీవెన్స్ తీసుకుంటున్న జిల్లా ఎస్పీ

సిబిఎస్ఇతో విద్యా ప్రమాణాలు మెరుగు

- 69 పాఠశాలలో అమలు : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సీబీఎస్ఈతో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారిని అనురాధ అన్నారు. వచ్చే ఏడాది నుండి 69 ప్రభుత్వ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ ను ప్రారంభిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సీబీఎస్ఈ సిలబస్ విధానంపై నంద్యాల పట్టణంలోని గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్క్రమాల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడం కూడా ప్రధానమైనదన్నారు. దీన్ని గమనించి సీబీఎస్ఈ విద్యా విధానంపై విస్తృత అవగాహన ఉపాధ్యా యులు కలిగి ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సిసిబిఎస్ ఈ అఫ్లియోషన్, శిక్షణ కార్యక్రమాలు అధికారుల బాధ్యతలు సిలబస్‌పై అవగాహన వంటి అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్స్ సుధారాణి అపర్ణలు హాజరయ్యారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి లలిత కుమారి,రిసోర్స్ పర్సన్స్ దినేష్ లక్ష్మణరావు, అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారులు షేక్ రఫీ, యునుస్ బాష తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో డీఈవో అనురాధ

బాల సాహిత్యంలో డాక్టర్ హరికిషన్ కృషి విశిష్టమైనది

- డాక్టర్ శాంతి నారాయణ

ప్రజాశక్తి - నంద్యాల

బాల సాహిత్యంలో డాక్టర్ హరికిషన్ కృషి విశిష్టమైనది ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శాంతి నారాయణ అన్నారు. అజో విబో కందాళం ఫౌండేషన్, కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల సంయుక్త నిర్వహణలో గురువారం నుండి నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాహితీ నాటక ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం విశిష్ట బాలసాహిత్య రచన పురస్కారం అందుకోబోతున్న కర్నూలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎం. హరి కిషన్ సాహితీ కృషిపై సదస్సు నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వైయస్సార్ జీవితకాల సాధన పురస్కార గ్రహీత అనంతపూర్‌కు చెందిన డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో,అన్నెం శ్రీనివాసరెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొని హరికిషన్ బాలసాహిత్యంపై విశ్లేషించారు. హరికిషన్ కథల్లో వస్తు వైవిధ్యం, వారి కథలలో స్త్రీ జీవిత చిత్రన , కర్నూలు జిల్లా చరిత్రలో హరి కిషన్ పాత్ర వంటి అంశాలపై రామిరెడ్డి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు డాక్టర్ శివకుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సాహితీ సదస్సులో డాక్టర్ చంద్రు పట్ల తిరుపతిరెడ్డి రచించిన ఆత్మీయ భావాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సు కార్యక్రమాన్ని ఫౌండేషన్ తరపున అప్పా జోసుల సత్యనారాయణ, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ ఆర్ ఎస్ ప్రసాద్ పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న శాంతి నారాయణ



నాటికలో ఓ సన్నివేశం

నేడు టిడ్కో గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టణంలో 8700 టిడ్కో గృహ ప్రవేశాలు శనివారం జరగున్నాయి. ఈ మేరకు శుక్రవారం నాడు ప్రారంభోత్సవ ఏర్పాట్లను టిడ్కో ఇంజనీర్ల బృందం పరిశీలించింది. తొలుత స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ప్రాజెక్ట్ వివరాలు అందజేసి బృంద సభ్యులు వివరించారు. అనంతరం నంద్యాల మునిసిపాలిటీ పరిధిలోని ఎస్.ఆర్.బిసి కాలనీలో 3904, వై.ఎస్.ఆర్ నగర్‌లో 3825, అయ్యలూరి మెట్టలో 2262 గృహాలు టిడ్కో ద్వారా నిర్మిస్తున్న 10,000 వై.యెస్.ఆర్ జగన్నన్న నగర్ జింత్రీ గృహ సముదాయాలను టిడ్కో ఇంజనీర్లతో కలసి పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పలు గృహ సముదాయాలను, మంచినీటి వసతులు, ఎస్టిపి పరిశీలించి ప్రాజెక్ట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులకు సూచనలు జారీ చేశామని ఎపి టిడ్కో చైర్మెన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. మౌలిక సదుపాయలు వాటర్ సప్లై, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, గ్రీనరీ ఎలెక్ట్రిఫికేషన్ మురుగు కాలువలు ఏర్పాటు చేస్తూ చక్కటి పర్యావరణములో ఇళ్లు అందజేసే విధముగా కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో సూపరెంటెండింగ్ ఇంజినీర్ రాజశేఖర్, మునిసిపల్ కమీషనర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోపాలకృష్ణ, సి.ఎల్. టి.సిలు శంకర్, రామ సుబ్బయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్ నాయక్, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో
సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి ప్రజలను ప్రమాదాల భారీ నుంచి కాపాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ కోరారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుప్ ఆసియా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావుకి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ఏరియాలలో మెయిన్ రోడ్డు వెంబడి సెంట్రల్ లైటింగ్ పెద్ద లైట్లు వేయాలని కోరారు. కోర్టు రోడ్డు, సాయిబాబా గుడి ఆర్చి దెగ్గర,ఆర్టీసీ బస్టాండు, గౌడ్ సెంటర్,రఘునాథ్ సెంటర్, నంద్యాల టర్నింగ్, గాంధీ పార్కు, పాత బస్టాండు, సంగమేశ్వరం సర్కిల్, గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర కోర్టుకు వెళ్లే రోడ్డు సర్కిల్లో ప్రధాన పట్టణాల్లో ఏర్పాటు చేసిన విధంగా సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి పోల్స్‌కు డెకరేషన్ లైట్లు వేయాలని కోరారు. అలాగే పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న కాలనీలోకి అనుగుణంగా అన్ని వీధులలో ప్రధాన కూడలిలో సెంటర్లో పెద్ద ఎల్ఇడి లైట్లు వేసి వేయాలని అన్నారు. పట్టణ ప్రజలు ఉదయం పూట తమ ఆరోగ్యాలు కాపాడుకోవడానికి కేజీ రోడ్డు వెంబడి తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాకింగ్ చేస్తూ ఉన్నారు. కాబట్టి కేజీ రోడ్డు వెంబడి ఉన్నటువంటి వీధిలైట్లను ఉదయం 6 గంటల వరకు వెలిగించాలని అదేవిధంగా ఇంద్రానగర్ చివర్లో అయ్యప్ప స్వామి గుడి దగ్గర రెండు కొత్త వీధిలైట్లు పెద్ద వేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎన్.స్వాములు, ఏ. సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, నాయకులు సిలార్, గణపతి, రాజేష్, అంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

ధర లకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరుతూ నంద్యాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం భిక్షాటన నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు కనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచి,ప్రతి నెల రెగ్యులర్‌గా ఇవ్వాలని అన్నారు. 2018లో అమలు చేసిన హాస్పిటల్ చార్జర్ నేటికీ విద్యార్థులకు అందజేస్తున్నారన్నారు. నంద్యాల పట్టణ నాయకులు కిరణ్,సుమంత్, గోపాల్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

వలసలను నివారించడంలో ప్రభుత్వం విఫలం

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల వలసలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని, గ్రామాల్లో ఉపాధి కూలీలకు వెంటనే పనులు కల్పించాలని వలసలు నివారించేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం గ్రామం నుండి ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోని చిన్న గుడిపాడు గ్రామానికి వలస వెళుతున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని గ్రామాల నుండి ఎలాంటి పనులు దొరకక కూలీలు ఇప్పటికే వరుస వెళ్లడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పనులకు వేతనాలు రాక పోవడం, తక్కువ వేతనాలు రావడంతో కూలీలకు నిరాశ మిగిల్చిందని తెలిపారు. వలస కూలీలకు ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పనులు కల్పించి రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజ్ఞానం, శీలం, గిరి, ఏసు రాజు, నందు, తదితరులు పాల్గొన్నారు.




వలస వెళుతున్న కూలీలతో మాట్లాడుతున్న దృశ్యం

అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీలకు షాహిద్

ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పేద కుటుంబంలో పుట్టి గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తూ అంతర్జాతీయ బేస్ బాల్ పోటీలకు ఎంపికైన చాగలమర్రికి చెందిన రజమ్మ గారి షాహిద్‌కు ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల నాని అభినందిస్తూ చేయూత నిచ్చారు. భారత జట్టు తరుపున ఎంపికైన క్రీడాకారుడు షాహిద్ పాకిస్తాన్ దేశంలోని ఇస్లామాబాద్‌లో జరిగే అంతర్జాతీయ బేస్ బాల్ పోటీల్లో పాల్గొనుటకు ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే గంగుల శుక్రవారం జిల్లా బేస్బాల్ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ సమక్షంలో లక్ష రూపాయలను విరాళముగా ఇచ్చి ఆదుకున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం నుండి షాహిద్ అంతర్జాతీయ బేస్బాల్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం బేస్ బాల్ జిల్లా చైర్మన్ షేక్ బాబూలాల్ మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ నుండి చండీగడ్‌లో నిర్వహించనున్న కోచింగ్ క్యాంపుకు షాహిద్ వెళ్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో బేస్ బాల్ జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, మండల కో–ఆప్షన్ సభ్యులు జిగ్గి గారి ఇబ్రహీం, వైసిపి నాయకులు గేట్ల మహబూబ్ సాబ్, నాయబ్ రసూల్, చక్రం సంస్థ అధినేత ముల్లా షబ్బీర్, దాదా బీడీ ఖాజా,ముల్లా ఖాజా రసూల్, ముల్లా ఖాదర్ బాషా, ముల్లా షేక్ష వల్లి, క్రీడాకారుడి తండ్రి రాజమ్మ గారి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని కొణిదెల గ్రామం ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉప్పుగళ్ళ పెద్ద శేషన్న జయమ్మ దంపతుల 2వ కుమారుడు అరవింద్ (అలియాస్ గిద్దోన్) (18) తల్లిదండ్రులు చదువుకోవాలని మందలించడంతో మనస్థాపంతో వేకువజామున 4 గంటల సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్సై ఎన్వి రమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అరవింద్ (ఫైల్)

హార్టికల్చర్ ప్లాంట్ల పరిశీలన

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

మండలంలోని హార్టికల్చర్ ప్లాంట్లను ఎంపీడీవో మణిమంజరి పరిశీలించారు. శుక్రవారం జూపాడుబంగ్లా గ్రామ పరిధిలో ఏర్పాటైన డ్రాగన్ ఫ్రూట్, జమ తోట్లను ఆమె సందర్శించారు. హార్టికల్చర్, నర్సరీలో మొక్కల సంరక్షణను పరిశీలించారు. రహదారులకు ఇరువైపులా నాటిన ప్రతి మొక్కనూ బాధ్యతగా సంరక్షించాలన్నారు. హార్టికల్చర్‌కు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీవో గౌరీ బాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఇఒ సుభాన్ మధ్యాహ్న భోజన పథక నిర్వహ కులకు ఆదేశించారు. శుక్రవారం మండల లోని పాలమర్రి ఎంపిపి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు.



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంఇఒ

భక్త బృందానికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

సమరత సేవ సమితి భక్త బృందానికి తెలుగు మండల యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. సొంత ఖర్చులతో వస్త్రదానం, అన్నదానం కార్యక్రమం చేస్తున్న పెట్నికోట గ్రామానికి చెందిన గొంగటి హుస్సేన్ రెడ్డిని శుక్రవారం సమరత సేవ సమితి భక్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమరత సేవ సమితి భక్తులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లకు ఊయల సేవ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక ఊయల సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉయల సేవలో ఏర్పాటుచేసి విశేష కార్యక్రమాలు పూజలు నిర్వహించారు. **శ్రీశైల క్షేత్రం లో గిరిప్రదిక్షణ :** పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీశైల దేవస్థానం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించింది. అనంతరం ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమము నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుండి భక్తులు పాల్గొన్నారు. బ్రిటన్, అమెరికా నుండి ప్రవాస భారతీయులు ఈ సేవలో పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ప్రజాశక్తి -ప్యాపిలి

మండల పరిధిలోని సిద్ధన గట్టు గ్రామ శివారులలో గల సిద్దేశ్వర ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటన చోటు చేసుకుంది. జలదుర్గం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సిద్ధన గట్టు గ్రామ శివారులో గల సిద్దేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం కింద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జలదుర్గం ఎస్ఐ నరేష్ తెలిపారు.



పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహానంది : ప్రజాశక్తి 2023 నూతన క్యాలెండర్‌ను శుక్రవారం నాడు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు రవిశంకర్ అవధాని, ఆలయ అర్చకులు జనార్ధన్ శర్మ, మహానంది మండలం వైసిపి నాయకులు భూమా సుబ్బరామయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, మీరాపురం గ్రామ వైసిపి యువ నాయకుడు యామ్మనూరు మనోహర్ రెడ్డిలు 2023వ సంవత్సరం నూతన క్యాలెండర్‌ను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం అవిష్కరించారు. యాగంటి దేవస్థానం పరిధిలో జరుగుతున్న పలు అభివద్ధి పనులు, మీరా పురం గ్రామ అభివృద్ధి పనులు కనబడేటట్లు క్యాలండర్‌లో రూపొందించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కాటసానికి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

జిఓ1ను రద్దు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి



మాట్లాడుతున్న డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

జగన్ నిరంకుశత్వ పాలనలో చీకటి జిఓ జారీ చేయడం దుర్మార్గపు చర్య అని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష అన్నారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబర్ 1కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టి జిఓ ప్రతులను దహనం చేసారు. అనంతరం వారు మాట్లాడారు. చంద్రబాబు సభలకు లభిస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం ఇలాంటి జిఓలను విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు,నంద్యాల పార్లమెంట్ ముస్లీం మైనార్టి నాయకులు కొలిమి హుసేన్‌వళి,నంద్యాల పార్లమెంటరీ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు,మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్,ప్రచార కార్యదర్శిగఫార్,టిడిపి నాయకులు వేణుగోపాల్ రెడ్డి, కొలిమి షరీఫ్,అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు. **తిమ్మ నాయుని పేటలో .. కొలిమిగుండ్ల :** మండలంలోని తిమ్మ నాయుని పేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రెండవ విడత"ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి"కార్యక్రమం టిడిపి నాయకులు నంద్యాల రామేశ్వర్ రెడ్డి శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కామిని కలవటాల కష్ణ రంగారెడ్డి కామిని భాస్కర్ రెడ్డి, బాలు రవి ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **ఇదేం ఖర్మ వ్యాపారస్తులకి... డోన్ :** పట్టణంలో టిడిపి కార్యాలయం నందు డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు డోన్ నియోజకవర్గ టిడిపి వాణిజ్య విభాగం కమిటీ అధ్యక్షులు రేగటి భీమా రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి,రాష్ట్ర తెలుగుదేశంపార్టీ వాణిజ్య కమిటీ ప్రధాన కార్యదర్శి రవిశంకర్,నంద్యాల జిల్లా వాణిజ్య కమిటీ అధ్యక్షులు టంగుటూరి శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం డోన్ పట్టణంలోని మాకం వీధి నందు వ్యాపారస్తుల వద్దకు వెళ్ళి వైసిపి ప్రభుత్వం వ్యాపారస్తులకు చేస్తున్న మోసాలను, ద్రోహాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ఉచితంగా అందే ఇసుకను రద్దుచేసి సిమెంటు సిండికేట్ తో 124 వ్యాపారాలను దెబ్బతీశారన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ ఆలా మల్లిఖార్జున రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ లీగల్ సెల్ కమిటీ సభ్యులు మధుసూదన్ గౌడ్, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున, అడ్వకేట్ ఎస్ టి హారుణ్ ,నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు,లక్ష్మిశెట్టి కష్ణప్రసాద్, డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగు యువత కమిటీ అధ్యక్షులు కుమ్మరి సుధాకర్,వాణిజ్య కమిటీ నాయకులు బనగానపల్లె టిడిపి వాణిజ్య కమిటీ అధ్యక్షులు నాగిరెడ్డి, వాణిజ్య కమిటీ ఉపాధ్యక్షులు మహేష్, వాణిజ్య కమిటీ ఉపాధ్యక్షులు కదిరప్ప, కమిటీ సభ్యులు వేంకటరాముడు, వాణిజ్య కమిటీ సభ్యులు మౌలాలి రెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వేంకటేష్ చౌదరి,వాణిజ్య కమిటీ సభ్యులు నాగాఅచారి,వాణిజ్య కమిటీ సభ్యులు పోతుదొడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **రాష్ట్రంలో చీకటి పాలన పాణ్యం :** మండలం తమ్మరాజు పల్లె గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ బాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపికి బుద్ధిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి దుబాయ్ శీను, బూత్ కమిటీ కన్వీనర్ దస్తగిరి పాల్గొన్నారు.



చాగలమర్రి: జిఓ ప్రతులను దహనం చేస్తున్న టిడిపి నాయకులు



తిమ్మ నాయుని పేటలో ..







జగనన్న సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మారథం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు మూలసాగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 72వ రోజు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి వార్డు కౌన్సిలర్ శేగు రెడ్డి, అనురాధ, వైఎస్ఆర్సిపి నాయకులు భాస్కర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేసి, సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాభూన్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి ,మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పంషావలి, వైఎస్ఆర్సిపి నాయకులు దాల్మిల్ అమీర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరంలో..** మండల కేంద్రంలోని రుద్రవరం సచివాలయం 3 పరిధిలోని బలిజ పేట, పడమ టి వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన వెంట వైయస్సార్సీపి సీని యర్ నాయకుడు, పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్, గంగుల మనోహర్ రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీచైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ బాలస్వామి, సర్పంచ్ బైరి విజయలక్ష్మి, వైఎస్సార్సీపీ నాయకులు గంగిశెట్టి తిమ్మయ్య, గంగిశెట్టి మద్దిలేటియ్య, బైరి బ్రహ్మం ,దేవగుడి జాకిర్ హుస్సేన్, ఏరువా కృష్ణమూర్తి, కొల్లం పుల్లయ్య, బైరి శంకర్,వైసీపీ యువ నాయకులు సింగతల మహేశ్వర రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. **బైరెడ్డి నగర్‌లో.. నందికొట్కూరు :** పట్టణంలోని బైరెడ్డి నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఆర్థర్ గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం చేశారు. వెంకటస్వామి, వలీ భాష , మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల. రబ్బాని, సింగిల్ విండో చైర్మన్ సగినేల.ఉసేనయ్య తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చడమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మండలంలోని సిద్దేపల్లె. పెద్ద అనంతపురం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, జడ్పిటిసి సభ్యుడు శివశంకర్ రెడ్డి, వైయస్సార్సీపి సమన్వయ కర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



11 నుండి నందికొట్కూరు నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలో జగనన్న సంక్రాంతి సంబరాలులో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను ఈనెల 11 నుండి 14 తేదీల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వాహకులు కర్నూలు, నంద్యాల జిల్లాల శాప్ కో- ఆర్డినేటర్లు శ్రీనాథ్ పెరుమాళ్ళ, రవి కుమార్ స్వామి దాసులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ఎంట్రీలు నిర్వహించబుడనని తెలిపారు.

గృహ సర్వేపై విడియో కాన్ఫరేన్స్

ప్రజాశక్తి - పగిడ్యాల

గృహలను సర్వేచేసి యాజమాణ్య హక్కు పత్రాలు మంజు చేయుటకు పంచాయితీ రాజ్ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం స్థానికి తహశీల్దార్ కార్యలయంలో విడియో కాన్ఫరేన్స్ నిర్వహించారు. మండలంలోని గ్రామ పంచాయితీల పరిదిలో పగడ్బందిగా గృహ సర్వే పై విసి ద్వార ఆవహగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మకూర్ డివిజన్ పంచాయితీ ఇన్చార్జి అధికారి కవిత, ఇఒఆర్‌డి పుల్లయ్య,పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్ల ఎంపికను శుక్రవారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఫిజికల్ ఫిట్నెస్ కలిగి ఉండాలన్నారు. గేమ్‌లో చివరి వరకు విజయం కోసం ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్ బాషా, రామేశ్వర్ రెడ్డి, రాజ కుమార్ రెడ్డి, పీఇటీలు షేక్షావలి, శ్రీధర్,ఖాజా సాయి,వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ట్రెజరర్ భుజంగరావు సీనియర్ క్రీడాకారులు అప్రోజ్,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన డిఎల్‌డిఓ



ప్రజాశక్తి -ప్యాపిలి

ప్యాపిలిలో వార్డు సచివాలయలను డిఎల్‌డిఓ స్పెషల్ ఆఫీసర్ జనార్ధన రావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ హాజరు పట్టికను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈయన వెంట ఎంపీడీవో ఫజల్ రెహమాన్, ఈఓఆర్‌డి పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

ప్రజాశక్తి - వెలుగోడు

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రాజేశ్వరి అనే ఆరో తరగతి విద్యార్థిని రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందని ఎస్సై జగన్మోహన్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం అదే ప్రాంతంలోని ఉన్న క్రాంతి వికలాంగుల పాఠశాల నందు రాజేశ్వరి ఆరో తరగతి చదువుతుందని తెలిపారు. తండ్రి నాగేశ్వరరావుతో కలిసి రాజేశ్వరి రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గుజరాత్ కు చెందిన యాత్రికుల బస్ ఢీకొనడంతో రాజేశ్వరికి గాయా పడిందని తెలిపారు. గాయపడిన రాజేశ్వరిని వైద్యశాలకు తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలకు పంపడం జరిగిందని అన్నారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫోన్ చేసిన వెటర్నరీ అంబులెన్స్ రావడం లేదు
- మాజీ ఎంపిపి రాంపల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి



పశువుల చికిత్సకు పశుసంవర్ధక శాఖ అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేస్తే ఫలితం లేదని వైసిపి నాయకులు మాజీ మండల అధ్యక్షుడు రాంపల్లె రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తమ స్వగ్రామమైన రాంపల్లి నుండి 1962కు పశుసంవర్ధక శాఖ అంబులెన్స్‌కు ఐదు రోజుల క్రితం ఫోన్ చేసి పశువుల చికిత్స చేయాలని కోరామన్నారు. కానీ సిబ్బంది అప్పుడు వస్తాం ఇప్పుడు వస్తాం అని కాలయాపన చేస్తున్నారని ఆయన తెలిపారు. వెంటనే స్పందించకపోతే ఈ అంబులెన్స్ ఎందుకని ప్రశ్నించారు. తనకే పలకకపోతే సామాన్య రైతులకు వీరు ఏ విధంగా పలుకుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెటర్నరీ అంబులెన్స్ సేవలను సక్రమంగా అందేలా చూడాలని కోరారు.

వ్యవసాయ మందుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - వెలుగోడు

పట్టణంలోని (ఎరువుల) వ్యవసాయ మందుల దుకాణాలను వ్యవసాయ సంచాలకులు ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారిని సునీత శుక్రవారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ దుకాణదారుడు లైసెన్సు పత్రాన్ని షాపులో ప్రదర్శించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అర్హత ఉన్న వారందరికీ పెన్షన్

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీచైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్లా వత్తుల సచివాలయంలో వైయస్సార్ పింఛను కానుక కార్యక్రమంలో భాగంగా కొత్తగా మంజూరైన వృదాప్య పెన్షన్3, వికలాంగులు 2 పెన్షన్లు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఎమ్మెల్యే గంగుల బ్రిజెంద్ర రెడ్డి ఆదేశాల మేరకు పింఛన్ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పాములేటి, ఎంపీపీ బాలస్వామి, ఎంపీటీసీ కాశయ్య,సర్పంచ్ చంద్రమోహన్, కోఆప్షన్ నెంబర్ మదర్ సాహెబ్, వైసీపీ నాయకులు లక్ష్మారెడ్డి, కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** 10వ సచివాయాలానికి సంబంధించిన కొత్తగా మంజూరైన 13 పింఛన్లను మున్సిపల్ కమిషనర్ పి. కిషోర్, మున్సిపల్ వైస్- చైర్మన్ మొల్ల రబ్బానీ అందజేశారు. శుక్రవారం మున్సిపల్ ఆఫీస్ సమీపంలోని జై కిసాన్ పార్క్ నందు ఫించన్ కానుక కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో 6వ వార్డ్ కౌన్సిలర్ దేశెట్టి సుమలత,7వ వార్డ్ కౌన్సిలర్ నాయబ్, పట్టణ నాయకులు దేశెట్టి శ్రీనివాసులు, ముజీబ్, రియాజ్, పఠాన్ రసూల్ ఖాన్,చంద్ బాషా, ఇమ్రాన్, అబ్బాస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కురుకుందలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండలంలోని కురుకుంద గ్రామంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షులు పి.మా బాష మాట్లాడుతూ రైతు సంఘం నిత్యం రైతుల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సలీం బాష, నాగేంద్రబాబు, హరికృష్ణ, శాలిమియా, రైతులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజును గెలిపించండి

ప్రజాశక్తి - నంద్యాల

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు గెలిపించాలని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, జిల్లా నాయకులు రాజేష్, అనిల్, మనోహర్, రామకృష్ణ, మహేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక ఇఎస్‌సి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల నందు శుక్రవారం అంతర జిల్లా పాలిటెక్నిక్ బాలురు, బాలికల పోటీలు ప్రారంభమయ్యాయి. కర్నూల్ జిల్లా యందు వున్న 10 పాలిటెక్నిక్ కళాశాలల నుండి 405 మంది వివిధ పోటీలలో పాల్గొన్నారు.

పుస్తకం అందరికీ మంచి నేస్తం : జెకెఆర్

ప్రజాశక్తి - బనగానపల్లె

పుస్తకం అందరికీ మంచి నేస్తం అని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల పట్టణానికి చెందిన విద్యా వారధి ఫౌండేషన్ చైర్మన్ జి సుబ్బరాజు సహకారంతో విద్యార్థులకు ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకు సాధించడానికి 100సూత్రాలు పుస్తకాలను పంపిణీ చేశారు. బ్రహ్మాండచారి మాట్లాడుతూ క్రమ శిక్షణతో విజయం సాధించవచ్చు అన్నారు. పాఠశాల హెచ్‌ఎంఎం సుబ్బన్న మాట్లాడుతూ విద్యా విశిష్టతను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ వెంకటస్వామి, తిమ్మ రాజయ్య, సురేంద్రబాబు, బద్రి నారాయణ, కే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న బ్రహ్మానంద ఆచారి

విఆర్ఎ, విఆర్ఒలను అవమానించడం తగదు : సిఐటియు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల రెవెన్యూ కార్యాలయాలలో దశాబ్దాల కాలంగా అటు ప్రభుత్వా కార్యకలాపాలకు ఇటు సమాజానికి అను నిత్యం వారదులుగా ఉంటూ సేవలు చేస్తూ చాలీచాలని వేతనాలతో జీవితాలను కొనసాగిస్తున్న వీఆర్ఏ, వీఆర్వోలను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అవమానకరంగా మాట్లాడడం సరైంది కాదని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ నాగేష్, టి భూపాల్, సిఐటియు జిల్లా నాయకులు వై ఎల్లయ్య, వైవి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నాడు సిఐటియు కార్యాలయం నందు ముఖ్య కార్యకర్తల సమావేశం సత్య రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీఆర్వో వీఆర్ఏల పట్ల అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఎమ్మెల్యే తన మాటలను వెనక్కి తీసుకోవాలని చేయాలన్నారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటి యు నాయకులు బి రామాంజనేయులు, ఎస్సీ కలాం శ్రీనివాసులు, రామకృష్ణ, మధు, నారాయణ పాల్గొన్నారు.



పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆత్మకూరు

సాగు చేసిన పంటలకు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని అర్బన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హాజీ షేక్ బైరాపురం మహబూబ్ బాష అన్నారు. మండలంలోని స్థానిక అర్బన్ రైతు భరోసా కేంద్రం నందు గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంను అర్బన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హాజీ షేక్ బైరాపురం మహబూబ్ బాష అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మహబూబ్ బాష మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ - పంట నమోదు చేసుకోవాలని, అలాగే ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. అలాగే సిద్దాపురం ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వలకు పిల్ల కాల్వలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం నందు రవి గౌడ్, సావిత్రి బాయి, అర్బన్ వ్యవసాయ సలహా మండలి సభ్యులు నబి సాహెబ్, మోమిన్ ఇబ్రిం కల్లిముల్ల, బోల్లు లింగమూర్తి, కిరణ్, ముసలమాడుగు రసూల్, మాబు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** పంట నమోదును పూర్తి చేయాలని సిబ్బందికి వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు వ్యవసాయ ఉద్యవన వ్యవసాయ గ్రామ సహాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్, ఈ కేవైసీ ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినందుకు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. **వ్యవసాయ పనిముట్లను మంజూరు చేయాలని** వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాలు శుక్రవారం ఆర్బీకేల్లో నిర్వహించారు. బి.ఉప్పలూరు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మండల వ్యవసాయ అధికారి పాల్గొని, మాట్లాడారు.

వైసిపిలోకి టిడిపి నాయకులు, కార్యకర్తలు చేరిక

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజవర్గంలోని శ్రీశైల దేవస్థానం పరిధిలో ఉన్న వ్యాపారస్తులు టిడిపి నాయకులు కార్యకర్తలు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వైయస్సార్సీపీలోకి భారీగా చేరారు. శ్రీశైల దేవస్థానం నుండి భారీ ఎత్తున ప్రత్యేక వాహనాల్లో ఆత్మకూరుకు రావడం జరిగింది. స్థానిక నంద్యాల టర్నింగ్ నుండి బస్టాండ్ వరకు భారీ వాహనాలు ర్యాలీని నిర్వహించారు. దీనితో కర్నూల్ గుంటూరు రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శ్రీశైలం నుండి వచ్చిన వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి నాయకులు టిఎండి రఫీక్, జిలాన్ బాష, ముర్తుజా నటరాజన్, మల్లికార్జున, గోపీనాథ్ రెడ్డి, ధ్రువనాయక్ ఆధ్వర్యంలో వందలాది మంది వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు చూసి పార్టీలోకి వస్తున్నారని ఆయన అన్నారు.



వైఎస్ఆర్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత



ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఇటీవల మృతి చెందిన మండలలోని గోర్వివానువల్లె గ్రామానికి చెందిన వంత్తబోయిన చంద్రశేఖర్, పుప్పాల సాంబశివుడు దండు కిట్టయ్య కుటుంబ సభ్యులకు వైఎస్ఆర బీమా చెక్కులను గ్రామ సర్పంచ్. బి.రామాంజనేయులు, వైసీపీ నాయకులు బి వి జగదీష్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు వారి కుటుంబ సభ్యులు డబ్బులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో.వైసీపీ నాయకులు గుర్రన్న, రమేష్, సూరుడు, క్రిష్ణయ్య, కంబగి,రి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రైతులు తమ పొలాల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి మంచి లాభాల్లో పొందాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం మండలంలోని జిలిగాపురం గ్రామంలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం దగ్గర రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

అయ్యప్ప స్వామికి వెండి విల్లు, బాణం విరాళం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల కేంద్రంలోని నంద్యాల రోడ్‌లోని అయ్యప్ప స్వామి వారి దేవాలయానికి బేతంచర్ల పట్టణానికి చెందిన వాసగిరి తిరుపాలయ్య కుమారుడు విశ్వనాథ్ అయ్యప్ప స్వామికి వెండి విల్లు, బాణమును శుక్రవారం బహుకరించారు. అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గుండా జయచంద్ర, బచ్చు సుబ్రహ్మణ్యం లకు వెండి విల్లంబులను అందజేశారు. కార్యక్రమంలో తిరుపాలయ్య, అన్నం దివాకర్ చౌదరి, చిన్ని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగును నివారించుకోండి



అవుకు : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారించుకోవాలని వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం మండలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

ప్రజా ప్రదర్శనకు అనుమతివ్వండి

ప్రజాశక్తి - నంద్యాల

ఈ నెల 28వ తేదిన నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని జిల్లా ఎస్పి రఘువీరారెడ్డికి రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కామిని వేణుగోపాల్ రెడ్డి, సీమకృష్ణ, పేరా శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ రాయలసీమ కరువు శాశ్వత నివారణకు కృష్ణ, తుంగభద్ర నదుల నీరు కీలకమన్నారు. తీగల వంతెన కాకుండా బ్యారేజ్ కం వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ కేంద్రం, రెండు తెలుగు రాష్ట్రప్రభుత్వాలపై వత్తిడి పెంచేందుకు రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో రాయలసీమ 8 జిల్లాల నుంచి ప్రజలు రాయలసీమ కరువు ప్రపంచానికి తెలిపేందుకు, సాగు, తాగు నీటికై ఈ నెల 28న సంగమేశ్వరం నుంచి 167కె జాతీయ రహదారి నిర్మాణం లో భాగంగా తీగల వంతెన నిర్మాణం జరిగే సిద్దేశ్వరం వరకు ప్రజా ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బజారి, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



జీవో 1ని వెంటనే రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - వెలుగోడు :

రాష్ట్ర ప్రభుత్వము ర్యాలీలను సభలను నియంత్రిస్తూ విడుదల చేసిన జీవో నెంబర్ ఒకటిని వెంటనే రద్దు చేయాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసు రత్నం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీనివాసులు, జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము నియంతృత్వ వైఖరితో కార్మికుల ఉద్యోగుల హక్కుల నరిస్తూ తనకు వ్యతిరేకంగా ఎవరు ఆందోళన చేయకూడదని మాట్లాడకూడదని ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకొని వచ్చారని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ఆ వాగ్దానాలు అమలు కోసం జరిగే ఎటువంటి పోరాటాలు ఆందోళనకు భయపడి ప్రభుత్వం నిరంకుశంగా ఉందన్నారు. వెంటనే జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రకృతి వ్యవసాయంతో పంటలను సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవ్వడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలరాజు,రమణయ్యలు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో గల కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద సిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై తగిన సూచనలను, సలహాలను ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూమి సారవంతాన్ని కోల్పోవడంతో పాటు రైతులకు అధిక ఖర్చులు అవతాయన్నారు. కార్యక్రమంలో సాగు నీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, వ్యవసాయ అధికారి రంగనేతాజీ,ఉధ్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి,కేవికే సిబ్బంది ఆదినారాయణ, రవిగౌడ్, ఏఈఓలు, వివిధ సచివాలయాల వ్యవసాయ,ఉధ్యాన సహాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సర్పంచ్ సూభాన్ అలి, ఈఓ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ ప్రజలు తమ నివాస, వ్యాపార, పరిసరాలతో పాటు పబ్లిక్ ప్లేస్ లను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ అయ్యలూరి సుభాన్ అలి, ఇఒ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గ్రామంలోని ఎన్‌హెచ్ సర్వీస్ రహదారులను పారిశుధ్య కార్మికుల తో పాటు డోజర్ సహాయంతో చెత్త చెదారం వ్యర్థ పదార్థాలను తొలగించే చర్యలు ఇఒ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో శుక్రవారం ముమ్మరంగా చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా అంటువ్యాధులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా చూసుకోవాలన్నారు.

